04
జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
మంగళవారం
10-03-2026
జిల్లా వార్తలు
WWW.DASHANEWS.COM

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

❖ రాష్ డ్రైవింగ్ ప్రమాదకరం..
❖ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి.
❖ మైనర్లు వాహనాలు నడపవద్దు.: గజ్వేల్ సిఐ రవికుమార్




**దశ, సిద్దిపేట జిల్లా:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో విద్యార్థిని విద్యార్థులు చదువుకునే పాఠశాలలు విద్యాలయాల వద్ద, పలువురు యువకులు ద్విచక్ర వాహనాలపై రాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాద భరితంగా వివిధ భంగిమల్లో ద్విచక్ర వాహనాలను నడిపిస్తూ సోషల్.. మీడియాలో పోస్ట్ చేసిన పలువురు యువకులను ఉద్దేశించి వాళ్ల వీడియోలను సోమవారం వివిధ సోషల్ మీడియా గ్రూపుల్లో గజ్వేల్ కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్తలు పోస్ట్ చేశారు. ఈ విషయాన్ని గమనించిన గజ్వేల్ సిఐ రవికుమార్, పోలీస్ బృందంతో వెళ్ళి రాష్, డ్రైవింగ్ చేస్తూ వీడియోలు తీసిన యువకులను వెంటనే అదుపులోకి తీసుకొని, వాళ్ల కి కౌన్సిలింగ్ ఇచ్చారు, ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ... వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వళ్ళు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే, చట్టపరమైన చర్యలు చేపడతామని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని రోడ్డు నియమాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు, కాగా ద్విచక్ర వాహనాన్ని రాష్ గా నడిపిస్తూ ప్రమాద... భరితంగా ఇతరులకు ఇబ్బంది పెట్టే విధంగా వీడియోలు తీసిన యువకులను వెంటనే పట్టుకొని వాళ్ల కు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలిపెట్టిన సీఐ రవికుమార్,కు పలువురు అభినందనలు తెలిపారు..

## దానం పై వేటు... పక్కా ?

❖ అనర్హత పిటీషన్ పై ముగిసిన విచారణ.



**దశ, హైదరబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటీషన్ పై విచారణ ముగిసింది. స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పును రిజర్వ్ చేశారు. ఈరోజుతో అనర్హత ఎమ్మెల్యేల పిటీషన్లపై విచారణ ముగిసింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు తమ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి మారినట్లు బీఆర్ఎస్ వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఇప్పటి వరకూ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పు చెప్పారు. ఇక కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలోనే తీర్పు చెప్పాల్సి ఉంది. అయితే కడియం శ్రీహరి విషయంలో ఏమో గాని దానం నాగేందర్ పై మాత్రం ఖచ్చితంగా అనర్హత వేటు పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు.దానం నాగేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా అందుకు సిద్ధమయినట్లే సమాచారం. సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున దానం నాగేందర్ విషయంలో అనర్హత వేటు పడటం ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది. సాంకేతికంగా ఆధారాలుండటం వల్లనే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని న్యాయ నిపుణులు కూడా చెబుతున్నారు. 2023 లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారుగా నిలిచారు. అయితే మిగిలిన ఎమ్మెల్యేలు కూడా కండువాలు కప్పుకున్నప్పటికీ వారికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం మాత్రం ఇవ్వలేదు. దానం నాగేందర్ విషయం మాత్రం డిఫరెంట్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాత్రం బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచి 2024 లోజరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన 12మందికి రూ.1,11,500 జరిమానా

❖ ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష.




**\దశ, సిద్దిపేట జిల్లా:** సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, తన సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 12 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా 09మార్చి2026 రోజున సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి, ముందు హాజరుపరచగా విచారణ చేసి 12 మంది వ్యక్తులలో ఒకరికి ఐదు (05) రోజుల జైలు శిక్ష మిగతా 11 మందికి రూ.1,11,500 జరిమానా విధించారు.డ్రైవింగ్ లైసెన్స్ లేని ఒక వ్యక్తికి రూ. 5,000 జరిమాన విధించినారు. జైలు శిక్ష విధించిన వ్యక్తి వివరాలు.దామెరుప్పుల మహేష్ , వయసు 31 సం, వృత్తి. డ్రైవర్ , నివాసం ఖాజీపేట, హన్మకొండ జిల్లా . ఐదు (05) రోజులు జైలు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపే వాళ్ల ని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాళ్ల కి ప్రమాదం రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు కూడా ప్రమాదమని ప్రమాదాల నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టో పట్టుబడిన వాళ్ల ని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ విచారణ జరిపి 10 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పదివేల రూపాయలు కట్టడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రజల్లో వాహనదారుల్లో అవగాహన రావడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు నడిపినచో ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా విధించడంజరుగుతుందన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.



## సమస్యలు పరిష్కరించండి

❖ కేజీబీవీ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

**\దశ, తాండూర్ :** కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, పట్టణ గురుకులాల్లో పనిచేస్తున్న బోధన బోధనేతర సిబ్బంది సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిస్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి డిమాండ్ చేశారు. పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన నిర్వహించి తాండూర్ కేజీబీవీ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ కేజీబీవీ యూఆర్ఎస్. ఎస్ఎస్ఏ లోని ఉద్యోగ ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస మూల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని, కేర్ టేకర్లను నియమించి రాత్రి కాపలా డ్యూటీల నుంచి విముక్తి చేయాలని కోరారు. మార్చి 16న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలకు ప్రభుత్వ స్పందించకపోతే మార్చి 20న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య, తాండూర్ మండల అధ్యక్షులు దేవదాస్, తాండూర్ కేజీబీవీ టీచింగ్ నాన్ టీచింగ్ స్టాప్, మండల వనరుల కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం భోజనం అందించాలి

❖ లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవు

**దశ, కోహెడ:** మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల లో రాత్రి భోజనాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం, మిల్మీకర్ కూర, సాంబారులను పరిశీలించారు. మెనులో భాగంగా చట్నీ చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. రోజు ఇలాగే చేస్తున్నారా మీ ఇష్టం వచ్చినట్లు పెడితే సహించేది లేదని తప్పనిసరిగా ప్రభుత్వం అందించిన కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వండిన ఆహారపదార్థాలు ప్రతి ఒక్కరికి కడుపునిండా పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. స్టోర్ లో సరుకులు చెక్ చేశారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వాడాలని సూచించారు. టమాటా, బీరకాయ, ఆకుకూరలు అందుబాటులో ఉన్న కూరలతో చట్నీ చేసి పెట్టాలని, వండిన ఆహారపదార్థాలు రుచికరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించి ఆహారం ఎలా ఉంది, రుచిగా ఉందా అని అడగ్గా బాగుంది అని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు. అనంతరం మండలం లోని నాగసముద్రాల గ్రామంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహం ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అన్నం, క్యాబేజీ కూర, సాంబారు, పెరుగు లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ చెక్ చేస్తూ రాసిన క్యాబేజీ కి వండిన కూర కు అస్సలు పొంతనలేదని కూర బరువు తూకం వేయగా చాలా తేడా వచ్చినందుకు గాను వార్డెన్ పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ డైట్ లో చట్నీ చేయలేదని రిజిస్టర్ లో సరిగ్గా రాయనందుకు గాను వార్డెన్ పైన యాక్షన్ తీసుకోవాలని డిఈఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం వసతి విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# అజార్ కు పదవీ గండం..?



**దశ, హైదరబాద్ :** అజహరుద్దీన్ ను హడావుడిగా మంత్రిని చేశారు.ఆరునెలల్లో ఎమ్మెల్యేగానో ఎమ్మెల్సీగానో ఎంపిక కావాలి. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ వద్ద దానికి సంబంధించిన ప్లాన్ ఏ లేదా ప్లాన్ బీ ఏదీ ఉన్నట్లుగా కనిపించడం లేదు. మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత గవర్నర్ కోటాలో ఆయన పేరును ఎమ్మెల్సీకి సిఫారసు చేశారు. విషయం కోర్టులో ఉండటంతో.. ఇంత వరకూ గవర్నర్ నిర్ణయం తీసుకోలేదు. పైగా కొత్త గవర్నర్ వస్తున్నారు. ఆయన కూడా నిర్ణయం తీసుకోకపోతే అజహర్ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.మైనారిటీ కోటాలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజహర్, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల లోపు ఏప్రిల్ 30, 2026 నాటికి అసెంబ్లీ లేదా కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక కావాల్సి ఉంది. ఈ ప్రక్రియలో ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులు ఆయన మంత్రి పదవిని సందిగ్ధంలో పడేశాయి.అజహరుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ ప్రభుత్వం గతంలోనే సిఫారసు చేసింది. అయితే, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లను గవర్నర్ తిరస్కరించడంపై దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉండటంతో, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అజహర్ నియామకంపై నిర్ణయం తీసుకోలేకపోయారు. ఇప్పుడు కొత్త గవర్నర్ రాకతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి గవర్నర్ కోటానే ప్లాన్ ఎగా భావిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్ వద్ద ప్లాన్ బిపై స్పష్టత లేకపోవడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఒకవేళ కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే, ఎమ్మెల్యే కోటాలో ఉన్న ఎమ్మెల్సీలలో ఒకరిని రాజీనామా చేయించి ఆ స్థానంలో అజహర్‌ను పంపే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే, సిట్టింగ్ ఎమ్మెల్సీలు ఎవరైనా తమ పదవిని వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మైనారిటీ ప్రాతినిధ్యం కోసం హడావుడిగా అజహర్‌ను మంత్రిని చేసిన రేవంత్ రెడ్డి సర్కారు, ఇప్పుడు ఆయనను చట్టసభలకు ఎలా పంపాలనే విషయంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో చిక్కుల్లో పడింది.

# సిద్దిపేట జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

❖ సైబర్ నేరాలపై విస్తృత అవగాహన..
❖ శ్రీనివాసు , డీఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీస్.







**దశ, సిద్దిపేట జిల్లా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల రక్షణే ధ్యేయంగా భారీ ఎత్తున సైబర్అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దిపేట మండలం పొన్నాల గ్రామంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో విద్యార్థినులకు సైబర్ మోసాల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించారు.

సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌తో కలుపుకొని కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 24 అవగాహన కార్యక్రమాలనువిజయవంతంగా నిర్వహించారు. చర్చించిన ప్రధాన అంశాలు:మహిళలు ఆన్‌లైన్ వేదికగా ఎదుర్కొంటున్న సవాళ్లపై డీఎస్పీ ప్రత్యేకంగా వివరించారు:సోషల్ మీడియాలో మహిళలను వేధించడం, అసభ్యకర సందేశాలు పంపడం వంటి వాటిపై ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. పెళ్లిళ్ల పేరుతో సోషల్ మీడియా మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ల ద్వారా జరిగే ఆర్థిక దోపిడీల గురించి హెచ్చరించారు."సాంకేతికత ఎంతగా పెరుగుతుందో, అంతే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. మహిళలు సోషల్ మీడియా వాడకంలో అప్రమత్తంగా ఉండాలి. బాధితులు భయం వీడి 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి.

## మొక్కలు పెరగడానికి చర్యలు చేపట్టండి

*జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్*



**దశ, భిక్కనూరు :** మొక్కలు పెరిగేలా చర్యలు చేపట్టాలని నీళ్లు పోసి చెట్లను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం ఆయన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని విజిట్ చేయడంతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగేందుకు క్రమం తప్పకుండా నీళ్లు పోయాలన్నారు. అంతేకాకుండా మొక్కల చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై మొక్కలను కాపాడాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి కావాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేసి, గృహప్రవేశాలకు ఇండ్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఏనుగు మంజుల సంజీవరెడ్డి, మండల అభివృద్ధి అధికారి రాజ్ కిరణ్ రెడ్డి, మండల విద్యాధికారి రాజ్ గంగారెడ్డి, పశు వైద్యాధికారి డాక్టర్ దేవేందర్, గ్రామ ఉపసర్పంచ్ గోల్కొండ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com